దరఖాస్తుకు ఆధార్, రేషన్ జిరాక్సులు చాలు

'అభయహస్తం' దరఖాస్తుకు వాటిని మాత్రమే జత చేయాలి
రేషన్ కార్డులేని వారు యజమాని కార్డు నంబర్ వేయాలి
గ్రామసభల్లో ఇవ్వలేని వారు 6లోగా జీపీల్లోనూ ఇవ్వొచ్చు
'ప్రజాపాలన' జిల్లా నోడల్ అధికారి ఎం.రఘునందన్‌రావు
ఖమ్మం నగరంలో పర్యటన.. 7వ డివిజన్ సభకు హాజరు

ఖమ్మం, డిసెంబర్ 29: గ్రామ, వార్డు సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాపాలన కార్యక్రమ ఉమ్మడి ఖమ్మం జిల్లా నోడల్ అధికారి ఎం.రఘునందన్‌రావు సూచించారు. ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారు తమ దరఖాస్తుకు ఆధార్, రేషన్ కార్డుల జిరాక్సులను జత చేస్తే చాలని అన్నారు. ఇవి తప్ప మరే ధ్రువపత్రాలు అవసరం లేదని అన్నారు. రేషన్ కార్డు లేని దరఖాస్తుదారులు ఉంటే వారి ఉమ్మడి కుటుంబ యజమాని కార్డు నంబరును సదరు దరఖాస్తుపై వేయాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఖమ్మం 7వ డివిజన్ మహిళా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన వార్డు సభను ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి ఆయన పరిశీలించారు.దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను గమనించి ప్రజాపాలన కార్యక్రమంపై సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు అర్హుల నుంచి దరఖాస్తులు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 28నే అభయహస్తం గ్రామసభలు ప్రారంభమైనందున అర్హులైన ప్రజలు వచ్చే 6లోగా తమ ప్రాంతాల్లో నిర్ణీత తేదీల్లో నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు ఫారం సరిపోతుందని అన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికి ఏ పథకం వర్తిస్తుందో ఆ మేరకు వివరాలు పూరించాలని సూచించారు. ఈ విషయంలో ఏ సందేహాలున్నా సభలోని హెల్ప్ డెస్కు సిబ్బంది వద్ద నివృత్తి చేసుకోవాలని సూచించారు. అయితే, గ్రామసభల్లో దరఖాస్తులు అందజేయలేని వారు జనవరి 6 లోగా వార్డు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆ దరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు. ఈ విషయంలో ఆందోళనలేమీ అవసరం లేదని అన్నారు. అయితే, అధికారులు కూడా స్వీకరించిన దరఖాస్తులను భద్రపరచి డాటా నమోదు చేయాలని సూచించారు. ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 62 టీములను ఏర్పాటు చేశామని, ఒక్కో టీములో 10 మంది అధికారులను నియమించామని తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు టీమ్ లీడర్లుగా వ్యవహరిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సహాయ శిక్షణ కలెక్టర్ మయాంక్ సింగ్ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, ఇతర అధికారులు విద్యాచందన, హరి కిషన్, సోమశేఖరశర్మ, శ్రీలత, విజేత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ రఘునందన్‌రావు, పక్కన కలెక్టర్ గౌతమ్

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్

ఆరు గ్యారెంటీ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. ఖమ్మం ఒకటో డివిజన్ టీఎన్జీవోస్ కాలనీ, రాపర్తినగర్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన వార్డు సభను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సభ నిర్వహించబోయే ముందు రోజే సంబంధిత కాలనీల ప్రజలకు ప్రభుత్వ సిబ్బంది ద్వారా దరఖాస్తులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తుదారులు వాటిని పూరించి రేషన్, ఆధార్ జిరాక్సులు జత చేసి సభలోని కౌంటర్ అందజేసి రసీదు పొందాలని సూచించారు. అధికారులు రామారావు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నగరంలోని ఎనిమిది డివిజన్లలో వార్డు సభలు

ఖమ్మం, డిసెంబర్ 29: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారెంటీల కోసం ఖమ్మం నగరంలోని ఎనిమిది డివిజన్లలో శనివారం వార్డు సభలను నిర్వహించనున్నట్లు కేఎంసీ అధికారులు తెలిపారు. 2వ డివిజన్ పాండురంగాపురం, 14వ డివిజన్ కొత్తగూడెం, గొల్లగూడెం, మధురానగర్, 15వ డివిజన్ అల్లిపురం, రుద్రంకొట, పుట్టకోట, 16వ డివిజన్ ధంసలాపురం, అగ్రహారం, కొత్తూరు కాలనీల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో వార్డు సభలు నిర్వహించనున్నట్లు వివరించారు.

'మోడల్'గా ఖమ్మం ఏఎంసీ

మార్కెట్ యార్డులను సందర్శించిన ఆర్కిటెక్, అర్బన్ ప్లానింగ్ అధికారులు

మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం వ్యవసాయం, డిసెంబర్ 29: రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు కలిగిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మోడల్ మార్కెట్ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ఏఎంసీపై దృష్టి సారించిన నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి, అదనపు డైరెక్టర్లు రవికుమార్, లక్ష్మణుడు ఖమ్మం వచ్చి ఈ వ్యవసాయ మార్కెట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లారు. అనంతరం సంబంధిత అధికారులతో మంత్రి సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ టెక్నికిల్, అర్బన్ ప్లానింగ్ అధికారులు, ఆర్కిటెక్, డ్రోన్ సర్వే విభాగాల అధికారులు గురువారం సాయంత్రం కూడా ఖమ్మం ఏఎంసీకి చేరుకున్నారు. శుక్రవారం వారంతా కలిసి మార్కెట్‌లోని మిర్చి, అపరాలు, పత్తియార్డులను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతోపాటు మోడల్ మార్కెట్ నిర్మాణానికి అవసరమైన చర్యలపై ఆరా తీశారు. అనంతరం మార్కెట్ కమిటీ అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులతో సమావేశమయ్యారు. రైతు విశ్రాంతి భవనాలు, భోజనశాల, అవసరమైన షెడ్లు, విద్యుత్ దీపాలు, ఫైర్ ఫైటింగ్, గేట్ ఎంట్రీ గదులతో యార్డుల విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం మార్కెట్ బ్లూప్రింట్‌ను పరిశీలించిన అనంతరం ఓ నివేదికను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఆర్కిటెక్చర్, అర్బన్ ప్లానింగ్ కన్సల్టెంట్ చిలకమర్రి శ్రీకామల్, సుంకర ప్రవీణ్, సుంకర స్మిత, ఇంజనీర్ ఉమామహేశ్వరరావు, డ్రోన్ సర్వేయర్ శ్రీధర్‌బాబు, వర్తక సంఘం బాధ్యులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, జీవై నరేశ్, మన్నెం కృష్ణ, దిరిశాల వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పలరావు, నల్లమల ఆనంద్, తేరాల ప్రవీణ్‌కుమార్, ఏఎంసీ అధికారులు రుద్రాక్ష మల్లేశం, బజార్, వజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'వైరా'ను అభివృద్ధి పథంలో నడిపిస్తా : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా టౌన్, డిసెంబర్ 29 : వైరా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరినీ సమాన దృష్టితో గౌరవిస్తానని, మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించేలా కృషి చేస్తానని తెలిపారు. తొలుత ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌ను మున్సిపల్ పాలకవర్గం ఘనంగా సన్మానించింది. మున్సిపల్ కమిషనర్ కరుణాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు దారెల్లి కోటయ్య, చల్లగుండ్ల నాగేశ్వరరావు, ధనేకుల వేణు, తడికమళ్ల నాగేశ్వరరావు, ఏదునూరి పద్మజ, మాదినేని సునీత, దారెల్లి పవిత్రకుమారి, కోఆప్షన్ సభ్యులు షేక్ బీబాసాహెబ్, అప్పం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

12.4 కేజీల గంజాయి పట్టివేత

పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

కొణిజర్ల, డిసెంబర్29 : ప్రొబిషనరీ అండ్ ఎక్సైజ్ ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ జీ.గణేష్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ కే.తిరుపతి ఆధ్వర్యంలో ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్, వైరా ఎక్సైజ్ సిబ్బంది మండలంలోని పల్లిపాడు శివారులో శుక్రవారం ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఒక వ్యక్తి నుంచి సుమారు 12.4 కేజీల ఎండుగంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. సదరు వ్యక్తి ఒడిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కలిమెల పులిమెట్ల తాలుకాకు చెందిన బ్రజేశ్వర్‌బైద్యగా గుర్తించారు. గంజాయి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. దాడుల్లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి, ఎస్సైజ్ సీఐలు సర్వేశ్వరరావు, రమ్య, ఎస్సై కిరిటీ, సిబ్బంది కరీం, సుధీర్, హనుమంతరావు, హరీశ్, నాగేశ్వరరావు, రవి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

చెరుకు క్రషింగ్ త్వరలో పూర్తి

కల్లూరు, డిసెంబర్ 29: కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో 2023-24 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి జనవరి 9వ తేదీతో చెరకు క్రషింగ్ పూర్తవుతుందని కాకతీయ షుగర్స్ వైస్‌ప్రెసిడెంట్ చల్లగుళ్ల నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాక్టరీ పరిధిలో అగ్రిమెంట్ చేసుకున్న చెరుకు రైతులు సకాలంలో చెరుకును ఫ్యాక్టరీకి తరలించాలని కోరారు. చెరుకు నరకడం మొదలుపెట్టని రైతులు ఫ్యాక్టరీ సిబ్బందిని సంప్రదించి పర్మిట్లు పొంది అగ్రిమెంట్ చేసిన చెరుకును జనవరి 9వ తేదీలోపు ఫ్యాక్టరీకి తరలించాలని రైతులకు సూచించారు.

మహిళా కానిస్టేబుల్ మృతిపై కేసు

స్వాతి (ఫైల్)

రఘునాథపాలెం, డిసెంబర్ 29: మహిళా కానిస్టేబుల్ అనుమానాస్పద మృతిపై ఖానాపురం హవేలీ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీహరి కథనం ప్రకారం.. ఖమ్మం టూటౌన్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మీగడ స్వాతి (29)కి అక్కడే కార్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజీవ్‌నగర్ గుట్టకు చెందిన వడకాల ప్రవీణ్‌తో గతంలో ప్రేమ వివాహం జరిగింది. కాగా, ప్రవీణ్ కొంతకాలంగా స్వాతిని వరకట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం వారి ఇంట్లో నుంచి పెద్దగా అరుపులు వినిపించాయి. అయితే ఆ పొరుగు ఇంట్లోనే ఉంటున్న స్వాతి అక్క మీగడ కవిత హుటాహుటిన వెళ్లి చూసింది. అప్పటికే స్వాతి విగతజీవిగా పడి ఉంది. ఆమె పక్కన తన మరిది ప్రవీణ్ ఉన్నాడు. దీంతో తన చెల్లి స్వాతిని తన మరిది ప్రవీణే చంపి ఉంటాడని అనుమానిస్తూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, స్వాతి మృతికి కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై సంతోశ్, పోలీస్ అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, జానిమియా సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌కు సన్నద్ధం కావాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 29: జిల్లా పరిధిలోని పాఠశాలల యాజమాన్యాలు జనవరిలో ఆన్‌లైన్‌లో నిర్వహించే జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌కు సన్నద్ధంగా కావాలని డీఈవో సోమశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా 108 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, విద్యార్థులు ప్రాజెక్ట్‌లు రూపొందించేందుకు వారి ఖాతాలో రూ.10 వేల చొప్పున జమ చేశామన్నారు. విద్యార్థులు జనవరి 18 లోపు ప్రాజెక్ట్ వివరాలను అన్‌లోన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

డిప్యూటీ సీఎం పీఏగా రాజేశ్

మధిర, డిసెంబర్ 29 : రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క పర్సనల్ అసిస్టెంట్‌గా కే.రాజేశ్‌ను నియమిస్తూ కలెక్టర్ వీ.పీ.గౌతమ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మధిర తహసీల్దార్ కార్యాలయంలో నయాబ్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కే.రాజేశ్‌ను మల్లు భట్టివిక్రమార్కకు పీఏగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన నియమించారు.

యువతి అదృశ్యం

చింతకాని, డిసెంబర్ 29 : మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి గురువారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆ యువతి తండ్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

మధిర, ఎర్రుపాలెం, డిసెంబర్ 29 : రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శనివారం నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలంలో పర్యటిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రైవేట్ సెక్రటరీ టీ.భాస్కర్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి శనివారం ఉదయం 10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి చాపర్‌లో బయల్దేరి భద్రాద్రి పవర్ ప్రాజెక్టు సైట్ పరిశీలన, అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఎర్రుపాలెంలో జిల్లా అధికారులతో సమావేశం, మధ్యాహ్నం 1.45 గంటలకు జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి దర్శించుకుని పూజల్లో పాల్గొంటారు.

ఆరబెట్టిన మిర్చి ఎత్తుకెళ్లిన దొంగలు

వైరాటౌన్, డిసెంబర్ 29 : ఆరుగాలం కష్టించి మిర్చి పంట సాగు చేసిన రైతును దొంగలు నిలువునా దోపిడి చేసిన ఘటన గురువారం రాత్రి వైరాలో జరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామానికి చెందిన రైతు కొల్లి నర్సింహారావు తనకున్న భూమితో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేశాడు. తొలుత కోసిన సుమారు 8 క్వింటాళ్ల మిర్చిని ఆరబెట్టి బస్తాలకు తొక్కేందుకు రాసిబోసి ఉంచిన మిర్చిని దొంగలు ఎత్తుకుపోయారు. బాధిత రైతు ఫిర్యాదుతో ఘటనా స్థలాన్ని ఎస్సై మేడా ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. వివరాలు సేకరించారున.

పల్లె ఆస్పత్రి తనిఖీ

చింతకాని, డిసెంబర్ 29: మండలంలోని ప్రొద్దుటూరు పల్లె దవాఖానను శుక్రవారం జాతీయ వైద్య బృందం(ఎన్‌క్వాస్) పరిశీలించింది. అందిస్తున్న సేవలను వైద్యాధికారుల నుంచి తెలుసుకుంది. బృందంలో డాక్టర్ సుమన్‌దేవ్, సనా అమరిన్ ఉన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఊరూరా 'జాతర'..!

ఖమ్మం రూరల్, డిసెంబర్ 29: పల్లెల్లో 'జాతర' సాగుతున్నది. ఐదు గ్యారంటీల అమలుకు ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలకు ప్రజలు పోటెత్తున్నారు. దీంతో ఈ సభలు 'జాతర'లను తలపిస్తున్నాయి. మండలంలో రెండోరోజు శుక్రవారం ప్రజాపాలన గ్రామ సభలు ప్రశాంతంగా కొనసాగాయి. మండలంలోని గూడూరుపాడు, కస్నాతండాలో ఎంపీడీవో ఆధ్వర్యంలోని బృందం; ఆరెంపుల, చింతపల్లి గ్రామాల్లో తహసీల్దార్ పీవీ రామకృష్ణ ఆధ్వర్యంలోని బృందం గ్రామ సభలను నిర్వహించించింది. ప్రజలు తరలివచ్చి దరఖాస్తులు ఇచ్చారు. ఏర్పాట్లను సీఐ రాజిరెడ్డి, ఎస్సై వెంకటకృష్ణ, మండల స్పెషల్ ఆఫీసర్ బి.జ్యోతి పర్యవేక్షించారు. ఆరెంపుల సభకు వచ్చిన కిన్నెర విజయకుమారి, కౌంటర్ నంబర్-1 వద్ద మూర్ఛ వ్యాధితో స్పృహ కోల్పోయింది. తహసీల్దార్ పీవీ రామకృష్ణ వెంటనే అక్కడే ఉన్న ఆశాలు, ఏఎన్ఎంను అప్రమత్తం చేశారు. వారు ప్రాథమిక వైద్యం అందించారు. కొద్దిసేపటి ఆమె కోలుకుంది.

సత్తుపల్లి రూరల్: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

కొణిజర్ల: లక్ష్మీపురం గ్రామ సభను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

కూసుమంచి మండలంలో..

కూసుమంచి, డిసెంబర్ 29: మండలంలోని ధర్మాతండా, అజ్మీరహీరామాన్ తండా గ్రామ సభలను ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ సంపత్ కుమార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో విద్యాచందన పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం మండలంలో..

తిరుమలాయపాలెం, డిసెంబర్ 29: మండలంలోని తిప్పారెడ్డిగూడెం, అజ్మీరాతండా, మేకలతండా, చంద్రుతండా, సోలీపురం, రాజారంలో శుక్రవారం ప్రజాపాలన గ్రామ సభలు జరిగాయి. ఎంపీపీ బోడ మంగీలాల్, జడ్పీటీసీ సభ్యుడు బెల్లం శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు, తహసీల్దారు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్లు మండలంలో..

బోనకల్లు, డిసెంబర్ 29: మండలంలోని గార్లపాడు, సీతానాగారం, రాపల్లి, పెద్దబీరవల్లిలో శుక్రవారం గ్రామసభలు జరిగాయి. దరఖాస్తుల స్వీకరణను ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, వైరా ఏసీపీ రెహమాన్ పరిశీలించి, అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో బయ్యవరపు అశోక్, ఎంపీవో కోటేశ్వరశాస్త్రి, సర్పంచులు ఆళ్ల పుల్లమ్మ, దారెల్లి నర్సమ్మ, మాలెంపాటి వాణి పాల్గొన్నారు.

కారేపల్లి మండలంలో..

కారేపల్లి,డిసెంబర్ 29: మండలలోని రావోజీతండా, సూర్యతండా, గంగారంతండా, గేట్‌కారేపల్లి, చిన్నమడెంపల్లి, సీతారాంపురంలో గ్రామసభలను తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో ఎం.చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి నిర్వహించారు. శనివారం దుబ్బతండా, రేగులగూడెం, చీమలపాడు, నానూనగర్‌తండా, గుట్టకిందగుంపులో గ్రామ సభలు ఉంటాయని తెలిపారు.

ముదిగొండ మండలంలో..

ముదిగొండ, డిసెంబర్ 29: మండలంలోని వల్లాపురం, పమ్మి, సువర్ణాపురం, న్యూలక్ష్మీపురం గ్రామ సభలను తహసీల్దార్ వై.రామారావు, ఎంపీడీవో అశోక్ నిర్వహించారు. ప్రత్యేకాధికారి (టీడబ్ల్యూవో డీడీ) విజయలక్ష్మి పర్యవేక్షించారు.

పెనుబల్లి మండలంలో..

పెనుబల్లి, డిసెంబర్ 29: మండలంలోని ఉప్పెలచెలక గ్రామ సభను తహసీల్దార్ గంటా ప్రతాప్ నిర్వహించారు. ఎంపీపీ లక్కినేని అలైఖ్య, జడ్పీటీసీ సభ్యుడు చెక్కిలాల మోహన్‌రావు, సర్పంచ్ కాకా రుద్రజారాణి పాల్గొన్నారు.

కల్లూరు మండలంలో..

కల్లూరు, డిసెంబర్ 29: మండలంలోని ముగ్గువెంకటాపురం గ్రామ సభను తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో రవికుమార్ నిర్వహించారు. ఆర్డీవో అశోకచక్రవర్తి పరిశీలించారు.

వేంసూరు మండలంలో..

వేంసూరు, డిసెంబర్ 29: మండలంలోని చిన్నమల్లెల, జయలక్ష్మీపురం గ్రామ సభలను ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ రాజు నిర్వహించారు. ఆర్డీవో అశోక్‌చక్రవర్తి పరిశీలించారు. ఏర్పాట్లను డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఏసీపీ రామానుజం తదితరులు పర్యవేక్షించారు.

చింతకాని మండలంలో..

చింతకాని, డిసెంబర్ 29: మండలంలోని రైల్వే కాలనీ, బొప్పారం, నరసింహాపురం, అనంతసాగర్ గ్రామసభలను ఎంపీడీవో తేళ్ళూరి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎన్.రమేష్ నిర్వహించారు. మొత్తం 1,249 దరఖాస్తులు వచ్చాయి. ఈ సభలను ఖమ్మం ఆర్డీవో జి.గణేష్ పరిశీలించారు. ఏర్పాట్లను ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

ఎర్రుపాలెం మండలంలో..

ఎర్రుపాలెం, డిసెంబర్ 29: మండలంలోని కాచవరం, బంజర, రాజులదేవరపా డు, మొలుగుమాడు గ్రామ సభలను స్పెషల్ ఆఫీసర్ వేణు మనోహర్, తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీవో శ్రీనివాసరావు నిర్వహించారు. ఏర్పాట్లను ఏవో విజయభాస్కర్ రెడ్డి, సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

కొణిజర్ల మండలంలో..

కొణిజర్ల, డిసెంబర్ 29: మండలంలోని లక్ష్మీపురం, చిన్నమునగాల గ్రామ సభలను తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, ఎంపీడీవో కె.మహాలక్ష్మి నిర్వహించారు. లక్ష్మీపురం సభను అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్ పరిశీలించారు. ఏర్పాట్లను ఎంపీపీ గోసు మధు, ఎంపీవో ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు.

సత్తుపల్లి మండలంలో..

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 29: మండలంలోని తాళ్లమడ గ్రామ సభలో దరఖాస్తులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి స్వీకరించారు. ఎంపీడీవో జయరామ్, ఏవో శ్రీనివాసరావు, ఏపీవో బాబూరావు, సర్పంచ్ మందలపు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ మండలంలో..

తల్లాడ, డిసెంబర్ 29: మండలలోని బాలపేట, మల్సూరుతండా, రంగంబంజర, కొత్తవెంకటగిరిలో గ్రామ సభలను ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, తహసీల్దార్ రవికుమార్ నిర్వహించారు. వైరా ఏసీపీ రెహమాన్ పరిశీలించారు. బాలపేటలో 312, మల్సూరుతండాలో 346, రంగంబంజరలో 277, కొత్తవెంకటగిరిలో 270 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

సత్తుపల్లి పట్టణంలో..

సత్తుపల్లి/సత్తుపల్లి టౌన్, డిసెంబర్ 29: సత్తుపల్లి పట్టణంలోని 3, 4, 12, 14 వార్డుల్లో సభలు జరిగాయి. అధికారులతో కలిసి దరఖాస్తులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి స్వీకరించారు. 4వ వార్డులో సభను అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్‌పర్సన్ తోట సుజలారాణి, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, దూది పాళ్ల రాంబాబు, నాగుల్‌మీరా, మందపాటి పద్మజ్యోతి, గ్రాం డ్ మౌలాలి, ట్రాన్స్‌కో ఏఈ శరత్, ఎన్నికల డీటీ శివకుమార్ పాల్గొన్నారు.

మధిర పట్టణంలో..

మధిర, డిసెంబర్ 29: మధిర పట్టణంలోని 14వ వార్డులోగల షాదీఖానాలో వార్డు సభను కౌన్సిలర్ వంకాయలపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత ప్రారంభించారు. కమిషనర్ రమాదేవి పాల్గొన్నారు.

వైరా పట్టణంలో..

వైరా టౌన్, డిసెంబర్ 29: వైరా పట్టణంలోని 3, 4 వార్డుల్లో వార్డు సభలను ప్రత్యేకాధికారి (ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్ర) పరిశీలించారు. కౌన్సిలర్ ఏదునూరి పద్మజ, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ పాల్గొన్నారు.

రూరల్: చింతపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్

బోనకల్లు: సీతానాగారంలో దరఖాస్తును పరిశీలిస్తున్న ఖమ్మం ఆర్డీవో

మధిర: దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

కల్లూరు: దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో అశోకచక్రవర్తి

తిరుమలాయపాలెం: చంద్రుతండా గ్రామ సభలో దరఖాస్తుల స్వీకరణ

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

కొణిజర్ల, డిసెంబర్ 29: మండలంలోని లాలాపురం గ్రామంలో గురువారం రాత్రి వృద్ధురాలు నున్న సావిత్రిమ్మ రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా దుండగులు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని పారిపోయారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదైంది.